క్లుప్తంగా

వెలగని వీధి దీపాలు

కర్నూలు(రూరల్): మండల పరిధిలో దిగువ పాడు గ్రామం ఎస్సీ కాలనీలో విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసిన వీధి లైట్లు వెలగడం లేదు. దీంతో రాత్రి సమయాల్లో బయటకు వెళ్లాలంటే ఇబ్బందిగా మారిందని కాలనీవాసులు వాపోతున్నారు. పిల్లలు, వృద్ధులు బయటికి రాలేని పరిస్థితి. వర్షాకాలం కావడంతో రోడ్లపై విష పురుగులు సంచరిస్తుండటంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి వెలగని లైట్ల స్థానంలో కొత్తలైట్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

నేడు మల్లన్నకు స్వర్ణరథోత్సవం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో లోకకల్యాణార్థం ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని గురువారం భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లకు దేవస్థాన అధికారులు స్వర్ణరథోత్సవం నిర్వహించనున్నారు. వేకువ జామున స్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, విశేష పూజలు అర్చకులు జరిపిస్తారు. ఆలయ మహాద్వారం ముందుభాగం గంగాధర మండపం నుంచి నంది మండపం వరకు రథోత్సవాన్ని జరిపిస్తారు.

సాక్షి గణపతికి విశేషపూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో లోకకల్యాణార్థమై బుధవారం సాయంత్రం సాక్షి గణపతికి అభిషేకం, ఆలయ ప్రాంగణంలోని జ్వాలా వీరభద్రస్వామికి విశేషపూజలు నిర్వహించారు. సాక్షి గణపతికి పంచామృతాలతోను, ఫలోదకాలతోను, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోదకం, శుద్ధజలంతో అభిషేకం చేసి విశేషపుష్పార్చన, నివేదన కార్యక్రమాలను చేపట్టారు. అలాగే జ్వాలా వీరభద్రస్వామివారికి అభిషేకం, విశేష పుష్పార్చన జరిపించారు.

మహానందిలో తగ్గిన భక్తుల రద్దీ



కామేశ్వరీదేవిని దర్శించుకుంటున్న భక్తులు

మహానంది: కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా మహానందీశ్వర స్వామి దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య బుధవారం తగ్గింది. పలు ప్రాంతాలకు చెందిన కొద్దిపాటి భక్తులు ఆలయానికి చేరుకుని కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని, పూజలు చేపట్టారు.

రీసర్వే పకడ్బందీగా చేపట్టాలి



రీ సర్వే పనులను వివరాలను పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తం

సి.బెళగల్: మండలంలోని బ్రాహ్మణదొడ్డి రెవెన్యూ గ్రామాలల్లో చేపట్టిన భూముల రీ సర్వే పనులను పకడ్బందీగా చేపట్టాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తం అన్నారు. బుధవారం గ్రామంలోని ఎనిమిదవ బ్లాక్‌లో మొదటి బృందం సభ్యులు సర్వే నంబర్ 488/ఎఫ్‌లో చేపట్టిన సర్వే పనులను, సర్వే అధికారులతో కలిసి పరిశీలించారు. ఆయన సర్వే సిబ్బందితో మాట్లాడుతూ.. రైతుల సమక్షంలో కొలతలను తీసుకోవాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండ సర్వే నివేదికలను నమోదు చేయాలన్నారు. రీ సర్వే డీటీ వెంకటేశ్వర్లు, సర్వేయర్ నాగభూషణం తదితరులు ఉన్నారు.


ఉపాధి పనుల్లో పురోగతి సాధించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ రాముడు

కోడుమూరు రూరల్ : వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఉపాధి సిబ్బంది తమకు కేటాయించిన పనుల్లో పురోగతి సాధించాలని ఎంపీడీఓ రాముడు సూచించారు. బుధవారం స్థానిక ఉపాధి కార్యాలయంలో ఎంపీడీఓ రాముడు ఏపీఓ మోదీన్ బాషా, ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు, మేటీలతో సమావేశమయ్యారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఉపాధి కింద మండలానికి 250 ఎకరాల్లో పండ్ల తోటలు సాగు చేయాలన్నది లక్ష్యంగా కాగా, ఇప్పటి వరకు 50శాతం కూడా చేరుకోలేకపోయారని, త్వరగా రైతులను గుర్తించాలన్నారు.

నాటుసారా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు



కొల్లంపల్లి తాండాలో బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

కర్నూలు (టౌన్): ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని నాటుసారా తయారీదారులపై బుధవారం ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. కల్లూరు మండలం కొల్లంపల్లి తాండాలో దాడులు నిర్వహించి 1,325 లీటర్ల నాటుసారాకు ఉపయోగించే బెల్లం ఊటను ధ్వంసం చేశారు. అలాగే చెన్నమ్మ సర్కిల్ వద్ద దాడులు నిర్వహించి 46 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇక మీదట ప్రతినిత్యం దాడులు నిర్వహిస్తామన్నారు. పదేపదే ఇలాంటి కేసులు నమోదైతే వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ఈ దాడుల్లో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్, ఈఎస్‌టీ సిబ్బంది పాల్గొన్నారు.

కౌలు గుర్తింపు కార్డులకు దరఖాస్తు చేసుకోండి



మాట్లాడుతున్న ఏఓ రూఫస్ రోనాల్డ్

కర్నూలు(రూరల్): కర్నూలు మండల పరిధిలోని కౌలు రైతులు గుర్తింపు కార్డుల (సీసీఆర్‌సీ) కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏఓ రూఫస్ రోనాల్డ్ సూచించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది మండలంలో 1350 కౌలు గుర్తింపు కార్డులు మంజూరు చేసేందుకు అధికారులు ఆదేశించారన్నారు. భూ యాజమాని హక్కులకు భంగం కలుగకుండా 11 నెలల కాలపరిమితితో గుర్తింపు కార్డులను జారీ చేస్తారని తెలిపారు. కౌలు రైతులు గుర్తింపు కార్డుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు భూ యజమాని పొలం పాస్‌బుక్, 1బీ కాపీ, ఆధార్ కార్డు, కౌలు రైతు ఆధార్ కార్డు, ఫొటోలు, ఏ సర్వే నంబరు లో ఎంత భూమి కౌలుకు ఇచ్చారో వంటి వివరాలు నమోదు చేస్తూ యజమాని అంగీకరిస్తూ సంతకం చేసిన ధ్రువపత్రాన్ని వీఆర్‌ఓకు అందజేయాలన్నారు.

వాహనాల బహిరంగ వేలం



వాహనాలకు వేలం నిర్వహిస్తున్న ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ డి.రామకృష్ణ

కోసిగి: కోసిగి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో అక్రమ మద్యం తరలిస్తూ పట్టుబడిన 45 వాహనాలకు జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ డి.రామకృష్ణ ఆధ్వర్యంలో సీఐ భార్గవ్ రెడ్డి నేతృత్వంలో బహిరంగ వేలం నిర్వహించారు. బుధవారం స్థానిక ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో ఉదయం నుంచి సాయంత్రం వరకు బహిరంగ వేలం నిర్వహించారు. ఇందులో 45 వాహనాలకు రూ.4,19,490 ఆదాయం సమకూరినట్లు సీఐ చెప్పారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ నిర్ణయించిన ధరకు అదనంగా 58.83శాతం పెరుగుదల వచ్చినట్లు తెలిపారు.

పట్టుబడిన మద్యం ధ్వంసం

పెద్దకడబూరు, కోసిగి మండలాల పరిధిలో పట్టుబడిన అక్రమ మద్యాన్ని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ డి. రామకృష్ణ ఆధ్వర్యంలో ధ్వంసం చేశారు. బుధవారం 31 కేసులలో పట్టుబడిన 320 లీటర్ల అక్రమ మద్యాన్ని స్థానిక మార్కెట్ యార్డులో ట్రాక్టర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు. వాటి విలువ రూ.1,45,200 ఉంటుందని సీఐ తెలిపారు. ఎస్ఐలు కార్తీక్ సాగర్, కె.నాగేంద్ర, హెడ్ కానిస్టేబుల్ కిశోర్ కుమార్, కానిస్టేబుల్ మునిరంగడు, భరత్, రవి పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న వీసీ వెంకట బసవరావు

కర్నూలు కల్చరల్: నిత్యం యోగా సాధన చేయడంతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని, మానసిక ప్రశాంతత లభిస్తుందని రాయలసీమ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ ఆచార్య వి.వెంకట బసవరావు అన్నారు. యోగాంధ్ర -2025 కార్యక్రమంలో భాగంగా బుధవారం వర్సిటీలోని పరిపాలనా భవనం నుంచి న్యూ లైబ్రరీ బిల్డింగ్ వరకు వర్సిటీ ఉద్యోగులు, విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించిన వీసీ మాట్లాడుతూ.. జూన్ 21వ తేదీ అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని ప్రభుత్వం ఈనెల 21 నుంచి జూన్ 21వ తేదీ వరకు నెల రోజుల పాటు యోగాకు సంబంధించి వివిధ అవగాహన కార్యక్రమాల నిర్వహణకు పిలుపునిచ్చిందన్నారు. అందులో భాగంగా వర్సిటీ ఉద్యోగులు, విద్యార్థులకు యోగా పట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరు యోగా గురించి తెలుసుకొని ఆచరించాలన్నారు. వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ మాట్లాడుతూ మానసిక ఒత్తిడిని అధిగమించడానికి, అనారోగ్యాలను ఎదుర్కోవడానికి యోగాను మించిన సాధనం లేదన్నారు. వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ బి.విజయకుమార్ నాయుడు మాట్లాడారు. ప్రముఖ యోగా శిక్షకులు ఎం.నాగరాజు యోగా ప్రాముఖ్యతను వివరించారు. ఆచార్య సీవీ కృష్ణారెడ్డి పీవీ సుందరానంద్, సి.విశ్వనాథరెడ్డి, ఎస్.వెంకటేశ్వర్లు, పి.శివకిషోర్, యోగా కోఆర్డినేటర్ కవిత, అధ్యాపకులు, బోధనేతర ఉద్యోగులు పాల్గొన్నారు.

90 శాతం సబ్సిడీతో విత్తనాలివ్వాలి

పత్తికొండ: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అన్ని రకాలుగా శుద్ధిచేసిన విత్తనాలను 90 శాతం సబ్సిడీతో అందించాలని సీపీఐ, రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం రైతు సంఘం పత్తికొండ నియోజకవర్గ కార్యదర్శి సురేంద్రకుమార్, జిల్లా సహాయ కార్యదర్శి రాజాసాహెబ్, కౌలుదారు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తిమ్మయ్య స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన తెలిపిన అనంతరం కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ మరో మూడు రోజుల్లో ఖరీఫ్ ప్రారంభం కావస్తున్నా ఇంతవరకూ ప్రభుత్వం ఖరీఫ్ ప్రణాళిక తయారు చేయకపోవడం దారుణమన్నారు. మార్కెట్లో రోజు రోజుకు విత్తన ధరలు పెరుగుతున్నా నియంత్రించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. అలాగే సీజన్ నాటికి అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20వేలు ఇస్తామని చెప్పినా దాని ఊసేలేదన్నారు. పెద్దముని, భగవాన్, దస్తగిరి పాల్గొన్నారు.

భారతి సిమెంట్ బారికేడ్ల వితరణ



పట్టణ పోలీస్‌స్టేషన్‌కు బారికేడ్లను అందజేస్తున్న భారతి సిమెంట్ కంపెనీ ప్రతినిధులు

ఎమ్మిగనూరురూరల్: పట్టణ, రూరల్ పోలీస్‌స్టేషన్లకు భారతి సిమెంట్ కంపెనీ 20 బారికేడ్లను వితరణ చేసింది. బుధవారం పట్టణంలోని శ్రీ సాయిరాఘవేంద్ర ట్రేడర్స్ ఆధ్వర్యంలో భారతి సిమెంట్ కంపెనీ రాయలసీమ డిప్యూటీ మేనేజర్ ప్రతాప్‌రెడ్డి, టెక్నికల్ మేనేజర్ ఓబులరెడ్డి, కరణం దేవేంద్రరెడ్డిలు టౌన్ సీఐ వి.శ్రీనివాసులు, రూరల్ ఎస్ఐ శ్రీనివాసులకు బారికేడ్లను అందజేశారు. టౌన్ సీఐ వి. శ్రీనివాసులు మాట్లాడుతూ భారతి సిమెంట్ కంపెనీ వారు ఇచ్చిన బారికేడ్లు ట్రాఫిక్ నియంత్రణకు ఉపయోగపడతాయని చెప్పారు. కంపెనీ రాయలసీమ మేనేజర్ మల్లారెడ్డి మాట్లాడుతూ సామాజిక సేవలో భాగంగా భారతి సిమెంట్ తరుపున రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఏదో ఒక రూపంలో సేవా కార్యాక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కంపెనీ కర్నూలు జిల్లా మేనేజర్ ఇక్బాల్, టెక్నికల్ ఆఫీసర్ ఉదయ్‌కిరణ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రతతో ఆరోగ్యం



పరిశుభ్రత దినోత్సవంపై ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

కోడుమూరు రూరల్ : మహిళలంతా వ్యక్తిగత శుభ్రత పాటించడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని రాష్ట్రీయ బాల ఆరోగ్య కార్యక్రమ ఆఫీసర్ డాక్టర్ శిరీషా అన్నారు. బుధవారం కోడుమూరులోని 5వ హెల్త్ సెంటర్‌లో పరిశుభ్రత దినోత్సవంపై అవగాహన ర్యాలీని వైద్య సిబ్బందితో కలిసి నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్రీయ బాల ఆరోగ్య కార్యక్రమ ఆఫీసర్ డాక్టర్ శిరీషా, జిల్లా నోడలాఫీసర్ డా.రఘు హాజరయ్యారు. డాక్టర్ శిరీషా మాట్లాడుతూ బహిష్టు సమయంలో మహిళలు, కిశోర బాలికలు వ్యక్తిగత శుభ్రత తప్పక పాటించాలని సూచించారు. రక్తహీనత ఉంటే వైద్య సిబ్బందిని సంప్రదించి మందులను వాడాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్రీయ కిషోర్ స్వాస్థ్య కన్సల్‌టెంట్ మల్లికార్జున, వైద్యులు డాక్టర్ మదన్‌శేఖర్, ఎంపీహెచ్‌ఈఓ నరసప్ప, హెల్త్ సూపర్‌వైజర్లు ఉమాబాయి, కమాల్‌సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 59 పరీక్ష కేంద్రాల్లో నిర్వహిస్తున్న పరీక్షల్లో భాగంగా బుధవారం జరిగిన సెమిస్టర్ పరీక్షలకు 143 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 4వ సెమిస్టర్ పరీక్షలకు 1788 మందికిగాను 1645 మంది హాజరు కాగా 143 మంది గైర్హాజరయ్యారని వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు.

30న జాబ్ మేళా

కర్నూలు కల్చరల్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీ ఉదయం 9.30 గంటలకు అబ్బాస్ నగర్‌లోని రవీంద్ర మహిళా డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కరెస్పాండెంట్ జి.పుల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్ మేళాలో 16 కంపెనీలు హాజరై ఉద్యోగ ఎంపికలకు నిర్వహించే ఇంటర్వ్యూల్లో అర్హులైన నిరుద్యోగ యువత పాల్గొనాలని పిలుపునిచ్చారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ చదివి 18–35 సంవత్సరాల వయసు గల ఆసక్తి గల యువతీ యువకులు జాబ్‌మేళాకు హాజరు కావచ్చని తెలిపారు. ఎంపికై న వారికి రూ. 10,000 నుంచి రూ.25,000 వరకు జీతం ఉంటుందని పేర్కొన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే వారు విద్యార్హత ధ్రువ పత్రాల జిరాక్స్ కాపీలు, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు వెంట తెచ్చుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 79934 77317 సెల్ నంబర్‌ను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

దేవరగట్టు హుండీ కానుకల లెక్కింపు

హొళగుంద: దేవరగట్టు మాళమల్లేశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.1.20 లక్షలు వచ్చినట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తిమ్మయ్య, రాజశేఖర్‌గౌడ్, మల్లికార్జున, నర్సానాయక్ బుధవారం తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి గట్టు దర్శనానికి వచ్చిన భక్తులు హుండీలో వేసిన కానుకలను బుధవారం నెరణికి, నెరణికి తండా, కొత్తపేట గ్రామాలకు చెందిన కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో లెక్కించారు. హుండీలో దాదాపు 2 నెలలకు సంబంధించి కానుకలున్నట్లు చెప్పారు. హొళగుంద ఎస్ఐ దిలీప్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చేపట్టారు. ఈ సొమ్మును ఆలయ అభివృద్ధి పనులకు వాడనున్నట్లు సభ్యులు వెల్లడించారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

తుగ్గలి : మండల కేంద్రంతో పాటు, చెర్వుతండాలో సారా స్థావరాలపై పత్తికొండ ఎక్సైజ్ సీఐ విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్ఐ సాయిప్రవీణ్, సిబ్బంది బుధవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రెండు గ్రామాలకు చెందిన కుమారి, సుంకమ్మ, రవినాయక్‌తో పాటు, జేఎం తండాకు చెందిన పాత ముద్దాయి రవిని అరెస్ట్ చేసి ఎనిమిది లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. సీఐ మాట్లాడుతూ సారా, అక్రమ మద్యం తయారీ, రవాణా, విక్రయాలు జరిపిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు పీడీ యాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు. సారా తయారీ, విక్రయాలపై సమాచారం అందించాలని అలాంటి వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు.

ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలి

దేవనకొండ: పంటల బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలని సీపీఎం జిల్లా నాయకుడు వీరశేఖర్, పార్టీ పట్టణ కార్యదర్శి ముక్కెళ్ల అశోక్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఏపీ గ్రామీణ బ్యాంకు ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం బ్యాంకు ఇన్‌చార్జ్ మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంటల బీమా ప్రీమియం రైతులే చెల్లించాలనే ప్రభుత్వ నిర్ణయంతో వారిపై తీవ్ర ఆర్థిక భారం పడుతుందన్నారు. పత్తి పంటకు ఎకరాకు రూ.2 వేలు, వేరుశనగకు రూ.600 చొప్పున, ఇతర పంటలకు ఆయా కంపెనీలు నిర్దేశించిన మొత్తంలో చెల్లించాలని బ్యాంకు అధికారులు చెబుతున్నారన్నారు. ప్రభుత్వమే ప్రీమియం చెల్లించి రైతులను ఆదుకోవాలని కోరారు. మహేంద్ర, రంగన్న, రాము, రంగడు, నాగన్న, కుమార్, రైతులు పాల్గొన్నారు.

కస్తూర్బాలో సీట్లన్నీ భర్తీ

కోడుమూరు రూరల్ : కోడుమూరులోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో సీట్లన్నీ భర్తీ అయినట్లు ప్రిన్సిపాల్ గౌసియాబేగం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో 6వ తరగతికి సంబంధించి 40సీట్లు ఉండగా, మొత్తం సీట్లన్నీ ఆన్‌లైన్ విధానంగా ద్వారా విద్యార్థులకు పూర్తిగా కేటాయించడం జరిగిందన్నారు. అలాగే ఇంటర్ ఫస్టియర్ బైపీసీలో 40సీట్లకు గాను 35సీట్లు ఆన్‌లైన్ విధానం ద్వారా భర్తీ అయ్యాయని, మిగిలిన 5సీట్లు కూడా ఆన్‌లైన్ విధానం ద్వారా భర్తీ చేస్తారన్నారు. కొందరు పిల్లల తల్లితండ్రులు రాజకీయ నేతల సిఫారసులతో తమపై సీట్ల కోసం ఒత్తిడి చేస్తున్నారని, అయితే తమ చేతుల్లో ఏమీ లేదని అర్థం చేసుకొని, తమపై ఒత్తిళ్లు తేవద్దండని ప్రిన్సిపాల్ కోరారు.

రుతుక్రమ శుభ్రత ముఖ్యం



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళ

కర్నూలు(హాస్పిటల్): రుతుక్రమ సమయంలో కిశోర బాలికలకు పరిశుభ్రత ముఖ్యమని డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళ చెప్పారు. బుధవారం ప్రపంచ రుతుక్రమ పరిశుభ్రత దినోత్సవం పురస్కరించుకుని స్థానిక వడ్డెగేరి యూపీహెచ్‌సీ పరిధిలోని 29వ సచివాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పి.శాంతికళ మాట్లాడుతూ.. ప్రపంచ రుతుక్రమ దినోత్సవం 2013 మే 28న జర్మనీకి చెందిన వాష్ యునైటెడ్ అనే ఎన్‌జీవో సంస్థ ప్రారంభించిందన్నారు. రుతుక్రమం వయస్సు పెరుగుదలలో భాగంగా జరిగే సహజ ప్రక్రియ దీనిపై బాలికలకు అవగాహన కల్పించి, వారిని ఆందోళనకు గురిగాకుండా చూడాలన్నారు. నెలసరి సమయంలో ప్రతిరోజూ స్నానం చేయాలని, ప్రతి ఆరు గంటలకు ఒకసారి శానిటరీ ప్యాడ్ మార్చుకోవాలని, వాడిన శానిటరీ ప్యాడ్‌ను పేపర్లో చుట్టి డస్ట్‌బిన్‌లో వేయాలని, ప్యాడ్ మార్చుకునే ముందు, తర్వాత చేతులను శుభ్రంగా కడుక్కోవాలని, వాడిన లోదుస్తులను ఉతికి ఎండలో ఆరవేయాలని, పోషకాహారం తీసుకోవాలని, వీలైనంత ఎక్కువ నీరు తాగాలని, తగినంత విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ఈ విషయాలపై కిశోర బాలికలకు ఆశాలు, ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు అవగాహన కల్పించాలని సూచించారు. డీపీఎంఓ డాక్టర్ ఉమ, డీఐఓ డాక్టర్ నాగప్రసాద్‌బాబు, డెమో శ్రీనివాసులు, డీపీఓ విజయరాజు, వైద్యాధికారి డాక్టర్ వెంకటప్రవీణ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక రీచ్ ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణ



మాట్లాడుతున్న ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్



పాల్గొన్న ముద్దటమాగి గ్రామస్తులు

హొళగుంద: మండలంలోని మార్లమడికి మజరా గ్రామమైన ముద్దటమాగిలో బుధవారం వేదావతి (హగరి) నదిలో ఇసుక రీచ్ నిర్వహణపై ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో భాగంగా గ్రామసభ జరిగింది. కార్యక్రమంలో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, మైనింగ్ డీడీ(గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్) రవిచంద్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఈఈ కిశోర్‌రెడ్డి, హొళగుంద తహసీల్దారు నిజాముద్దీన్ పాల్గొన్నారు. నది పరిధిలోని 127 సర్వే నంబరులో 7.814 హెక్టార్ల విస్తీర్ణంలో 78,140 క్యూబిక్ మీటర్ ఇసుక తవ్వకాలు సాగించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు అధికారులు గ్రామసభలో వివరించారు. ఇక్కడ ఇసుక రీచ్ ఏర్పాటు చేస్తే భారీ వాహనాలు తిరగడం వల్ల రోడ్లు దెబ్బతినడం, భూగర్భజలాలు అడుగంటి బోర్లు ఒట్టిపోతాయని గ్రామస్తుల్లో కొందరు తమ అభిప్రాయాన్ని తెలిపారు. రీచ్ మార్లమడికి దగ్గరులో ఉంటుందని వాహనాలు కూడా అటు వైపు తిరుగుతాయని, ఇబ్బంది ఉండదని అధికారులు చెప్పారు. అయితే రీచ్ ఏర్పాటుకు అధిక శాతం మంది అయిష్టంగా ఉన్నా బహిరంగంగా చెప్పలేకపోయారు. అలాగే.. గ్రామంలో సీసీ రోడ్లు, మంచీనీరు ఇతర సమస్యలను సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

రీ సర్వే ప్రక్రియ పరిశీలన..

మండలంలో రీ సర్వే పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎన్నికై న సుళువాయి గ్రామంలో జరుగుతున్న రీ సర్వే ప్రక్రియను సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ బుధవారం పరిశీలించారు. సర్వే పనులను పరిశీలించిన కార్యక్రమం ఏ మేరకు జరుగుతుంది, సమస్యలు ఇతర అంశాలపై తహసీల్దారు నిజాముద్దీన్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, మండల ఇన్‌చార్జ్ సర్వేయర్ శ్రీనివాసనాయక్‌తో చర్చించారు. పనుల్లో నిర్లక్ష్యం, వివాదాలకు తావివ్వకుండా రీ సర్వే చేపట్టాలని ఆదేశించారు.

నంబాల ఎన్‌కౌంటర్‌పై విచారణ జరిపించాలి

ఎమ్మిగనూరుటౌన్: మావోయిస్ట్ అగ్రనేత నంబాల కేశవరావుతో పాటు మరికొందరు మావోయిస్టులను ఎన్‌కౌంటర్‌పై సుప్రీం కోర్ట్ న్యాయమూర్తితో విచారణ జరిపించాలని పౌరహక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి దేవేంద్ర, నాయకులు వెంకటేశ్వర్లు, సీపీఐ జిల్లా నాయకుడు పంపణ్ణ గౌడ్, సీపీఎం నాయకుడు రాముడు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో పట్టణ కార్యదర్శి రంగన్న అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. కగార్ ఆపరేషన్ ప్రారంభమైనప్పటి నుంచి కేంద్రప్రభుత్వం 500ల మందిని పొట్టన పెట్టుకుందని ఆరోపించారు. మావోయిస్ట్ పార్టీ నాయకులు పలు మార్లు శాంతియుత చర్చలకు సిద్ధమైనప్పటికీ కేంద్రప్రభుత్వం ఏకపక్షంగా నరమేధం కొనసాగిస్తోందన్నారు. మావోయిస్ట్ అగ్రనేతతో పాటు మరికొందరని చంపి ఎదురు కాల్పుల్లో చనిపోయారని చెప్పడం శోచనీయమన్నారు. సమావేశంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు రాజు, ఐఎఫ్‌టీయూ నాయకులు ఏసేబు, బీసీ సంఘ నాయకులు బతకన్న, సీపీఐ నాయకులు భాస్కర్ యాదవ్, తిమ్మగురుడు, విజయేంద్ర, జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



నృత్యం ప్రదర్శిస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై తూర్పుగోదావరి జిల్లాకు చెందిన శారదా కళాక్షేత్రం వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. మహాగణపతిం, లింగాష్టకం, జ్యోతిర్లింగాకారా, శివస్తుతి, దేవీస్తుతి, పార్వతీవల్లభాష్టకం తదితర గీతాలకు, అష్టకాలకు జ్ఞానశ్రీ, ప్రసన్న, ఆద్యశ్రీ తదితరులు నృత్యప్రదర్శన చేశారు.

జయప్రదం చేయండి

కోవెలకుంట్ల: రాయలసీమలో శాశ్వత కరువు నివారించే సిద్ధేశ్వరం అలుగు సాధనకు నిర్వహించ తలపెట్టిన చలో సిద్ధేశ్వరం సభను జయప్రదం చేయాలని సాగునీటి ఉద్యమకారులు పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని జీవీ కొండారెడ్డి స్మారక గ్రంథాలయంలో సభకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రిటైర్డ్ లైబ్రేరియన్ పల్లె నరసింహారెడ్డి, ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు కరీంబాషా, సీఐటీయూ జిల్లా కార్యదర్శి సుధాకర్, కుందూ పరిరక్షణ సమితి నాయకులు పేరా శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతానికి తాగు, సాగునీరు పుష్కలంగా అందాలంటే అలుగుతో పాటు గుండ్రేవుల, తుంగభద్ర ఎగువ సమాంతర కాలువ, వేదవతి ఎత్తిపోతల ప్రాజెక్టు, తెలుగుగంగ, గాలేరునగరి, వెలగొండ, జోళదరాశి, రాజోలి ప్రాజెక్టులను సత్వరమే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.ఈ నెల 31వ తేదీన జరిగే బహిరంగ సభకు రాయలసీమ జిల్లాల నుంచి రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. వెంకటసుబ్బయ్య, ఓబులేసు, రామచంద్ర రాజు, వడ్డెసుబ్బరాయుడు, బాలయ్య, మహేశ్వ రావు పాల్గొన్నారు.

అవస్థల యోగా

సి.బెళగల్: మండల స్థాయి యోగా శిక్షణ కార్యక్రమ నిర్వహణపై మండల అధికారుల నిర్లక్ష్యపు ధోరణి రెండవ రోజు కూడా కొనసాగింది. మొదటి రోడు బురదలో యోగా శిక్షణ నిర్వహించిన అధికారులు, బుధవారం సైతం నామమాత్రపు ఏర్పాట్లు చేయడంతో, నేలపైనే యోగాసనాలు చేసేందుకు ఉద్యోగులు అవస్థలు పడ్డారు. స్థానిక భార్గవ రాయల్ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో బుధవారం సచివాలయ ఉద్యోగులకు, గ్రామ స్థాయి సిబ్బందికి మండల స్థాయి యోగా శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీడీఓ రాణెమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. అయితే కనీస ఏర్పాట్లలో అలసత్వం వహించడంతో మట్టిలో ఇబ్బందులు పడ్డారు. యోగా చేసుకునేందుకు కనీసం టార్పిలిన్ పట్టాలను సైతం అధికారులు ఏర్పాటు చేయకపోవడంపై ఉద్యోగులు అసహనం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా.. ఉదయం పది గంటలకు ప్రారంభం కావాల్సిన శిక్షణను 11 గంటల అనంతరం అధికారులు ప్రారంభించారు.



నేలపై అవస్థలు పడుతూనే యోగా శిక్షణ పొందుతున్న ఉద్యోగులు